క్లుప్తంగా

జెడ్పీ నిధులు కేటాయించాలని వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల సమస్యల పరిష్కారానికి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు వినతి పత్రం అందజేసినట్లు సర్పంచ్ వరబోయిన సుబ్బారావు గురువారం తెలిపారు. ఈ మేరకు జెడ్పీ నిధులు తమ పంచాయతీకి మంజూరు చేయాలని కోరామన్నారు. దానికి ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జున్ పాల్గొన్నారు.

పథకాలు అందించడానికి కృషి

గంగవరం: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో గ్రామ సచివాలయ సిబ్బంది తగిన కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. గురువారం ఆమె లక్కొండా గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించి వారికి జనవరి కల్లా అందించే విధంగా ఉండాలని సూచించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుంజం సిద్ధు, ఉపాధ్యక్షుడు గవరాజు పాల్గొన్నారు.

మారేడుమిల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్ విశ్వనాథ్



ఎంపీడీవో బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్ విశ్వనాథ్

మారేడుమిల్లి: స్థానిక ఎంపీడీవోగా తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు డీపీవో కార్యాలయంలో ఎఫ్ఏసీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవోగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఎంపీడీవోగా పనిచేసిన వీర కిశోర్ వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ధన్వంతరి ఉత్సవాలకు ఏర్పాట్లు



కరపత్రం విడుదల చేస్తున్న నాయీబ్రాహ్మణ నాయకులు

రాజవొమ్మంగి: ప్రపంచంలోనే తొలి శస్త్ర వైద్యుడు ధన్వంతరి జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయీబ్రాహ్మణ కమిటీ మండల ప్రెసిడెంట్ కరాసు లింగబాబు తెలిపారు. ఈనెల 29న రాజవొమ్మంగిలో స్వామివారి జయంతి రోజున చేపట్టనున్న పలు కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన గురువారం విడుదల చేశారు. కమిటీ సభ్యులు తాటితూరి చంద్రరావు, శ్రీనివాస్, త్రిమూర్తులు, శివన్నారాయణ, జీవ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను అమరిస్తే చర్యలు



ఎటపాక సీఐ కన్నపరాజు

గూడెంకొత్తవీధి: అడవుల్లో వన్యప్రాణులను వధించేందుకు అక్రమంగా విద్యుత్తు తీగలను అమర్చితే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అప్పలసూరి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దీనిపై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు.

ఎటపాక: అడవి జంతువుల వేటకు విద్యుత్ తీగలు అమరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కన్నపరాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అటవీశాఖ భూముల్లోనూ, వ్యవసాయ క్షేత్రాల్లోనూ, జన సంచార ప్రదేశాల్లోనూ అనధికారికంగా విద్యుత్ తీగలు అమర్చి జంతువులకు, మానవులకు హాని తలపెట్టే వారిపై చర్యలు తప్పవన్నారు. కరెంట్ తీగలు అమర్చి వేటాడే వారి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

వాడవాడలా ఘనంగా జయంతి వేడుకలు

అరకులోయ టౌన్: జాతీయ సేవా పథం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా అనే అద్భుతమైన పెయింటింగ్‌ను విద్యార్థులతో వేయించారు. పెయింటింగ్ ద్వారా యువతకు మరింత అవగాహన కలుగుతుందన్నారు. ఇందులో బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థి లొక్కోయి జగన్నాథంను ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ సంస్కృత సాహిత్యంలో మహా కావ్యం రామాయణం రచించి ఆదికవిగా పేరుగాంచారన్నారు. వాల్మీకి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజ్, ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, మొష్కా అనితకుమారి, పసుపులేటి నాగబాబు, అధ్యాపకులు ఎం. రాంబాబు, కొండబాబు, గణేష్, రాజు, లచ్చన్న, కామేశ్వరరావు, అంబికా, భవాని, సునీల్, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండల వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో గురువారం మారేడుమిల్లిలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్, మండల పరిషత్, సచివాలయం సిబ్బంది, మండల వాల్మీకి అధ్యక్షుడు గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), వార్డు మెంబర్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు కంభం విజయ్, బి.మురళి, ప్రసాద్, దూడ బ్రహ్మజీ, సువర్ణ రాజ్, లూజేష్ పాల్గొన్నారు.

రామాయణాన్ని అవగతం చేసుకొని పాటించాలి : ఎమ్మెల్యే శిరీషాదేవి

అడ్డతీగల: వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని అవగతం చేసుకొని పాటిస్తే, రాబోయే తరాలకు ఉపయుక్తంగా ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు.



స్వచ్ఛతా హీ సేవ పెయింటింగ్ వద్ద ప్రిన్సిపాల్, తదితరులు



అరకు డిగ్రీ కళాశాలలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అడ్డతీగల మండలం వేటమామిడిలోని గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ రాముడు దేవుడని ప్రపంచానికి రామాయణం ద్వారా వాల్మీకి చాటి చెప్పారన్నారు. తెలుగు యువత డివిజన్ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు, ఎస్ఐ బి.వినోద్, వాల్మీకి సంఘం సభ్యులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చింతపల్లి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధనా స్థానంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సన్మార్గంలో నడిచి ప్రతి ఒక్కరూ ఉన్నతి శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉన్నత వ్యక్తుల గురించి తెలుసుకుని గొప్ప వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త బయ్యపు రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త బాలహుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు డి.వెంకటేష్ బాబు, పి.జోగారావు పాల్గొన్నారు.



మారేడుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి జయంతి వేడుకల్లో ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం

ప్రతి ఒక్కరూ వాల్మీకిని స్మరించుకోవాలి

రాజవొమ్మంగి: హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ మహాకావ్యం రామాయణం చదవాలని, అటువంటి ఇతిహాసాన్ని రచించిన మహాపురుషుడు వాల్మీకిని మనం నిత్యం స్మరించుకోవాలని ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు తెలిపారు. స్థానిక వాల్మీకి నగర్‌లో ప్రతిభ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సంఘం అధ్యక్షుడు వజ్రపు అప్పారావు, సభ్యులు రాజబాబు, లవకుశ, రాంబాబు, అచ్చారావు, రమణ, మహేష్, స్వరూప, సౌందర్య పాల్గొన్నారు.

గంగవరం: జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కె. సిద్ధు ఆధ్వర్యంలో గంగవరంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిరమామిడి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఎంపీపీ పల్లల కష్టారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం. మండల వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్లె రాజుబాబు, వాల్మీకి సంఘం పెద్దలు పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం నివాళులర్పించారు.



వేటమామిడిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు తదితరులు



మారేడుమిల్లిలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, యూత్ సభ్యులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

హౌసింగ్ డీఈ రాజాబాబు

అరకులోయ రూరల్: గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని డీఈ రాజాబాబు తెలిపారు. మండలంలో సుంకరమెట్ట పంచాయతీలో సంగంవలస, దాబుగుడ, పెద్దగంగుడి, పిరిబంధ గ్రామాల్లో ప్రధానమంత్రి జన్‌మాన్ యోజన కింద నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 2,166 గృహాలు మంజూరయ్యాయని, మొదటి విడతగా 1,404 ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. రెండో విడతలో 762 గృహాలు నిర్మాణం చేపడతామన్నారు. పీటీజీ నిరుపేద గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క లబ్ధిదారుకు రూ.2.39 లక్షలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ శెట్టి కాంతి, సర్పంచ్ చిన్నబాబు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఈ రాజాబాబు, హౌసింగ్ ఏఈ శెట్టి కాంతి

డిసెంబరు 2 నుంచి సీపీఎం మహాసభలు

అరకులోయ రూరల్: డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు సీపీఎం 2వ శాఖ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో సుంకరమెట్ట పంచాయతీ దుక్కగుడ గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో పార్టీ జెండా ఆవిష్కరించి కామ్రేడ్ దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు మాట్లాడుతూ మహాసభలో ప్రజల సమస్యలు చర్చించేందుకు ప్రధాన వేదిక కానుందన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు లేవన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో పోలిస్తే, కేంద్రం ఇస్తున్న రూ.2.39 లక్షలతో గృహ నిర్మాణం కష్టంగా మారిందన్నారు. ఎన్టీఆర్ గృహాల నిర్మాణానికి అదనంగా రూ.2.50 లక్షలు పెంచాలన్నారు. నాయకుడు రామారావు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉపాధి పనులకు శంకుస్థాపన

గూడెంకొత్తవీధి: దామనాపల్లి పంచాయతీ బొర్రామామిడి గ్రామంలో గురువారం ఉపాధి హామీ పథకం పనులకు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందెరి రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఆగస్టు 23న గ్రామసభల ద్వారా గుర్తించిన పనులకు సంబంధించి వీటిని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఉప సర్పంచి చిలకమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటశివలక్ష్మి, ఈసీ వీఆర్పీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన బోధన



మాట్లాడుతున్న ఎంఈవో రాజులు

ఎటపాక: విద్యార్థినులకు మెరుగైన బోధన అందించాలని ఎంఈవో సరియం రాజులు తెలిపారు. స్థానిక కేజీబీవీని గురువారం ఆయన సందర్శించారు. వారికి అందుతున్న బోధన, మెనూ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిలబస్ ప్రకారం పాఠ్యాంశాలు పూర్తి చేసి, ప్రతిభ కలిగిన వారిగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయినులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. చదువుతో పాటు ఇక్కడి విద్యార్థినులు ఆటపాటల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

చోడవరం రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో 2024–25 గాను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. ఏపీపీజీ సెట్ -2024 అర్హత పొందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అడ్మిషన్స్ కొరకు ఏపీ పీజీ సెట్ అర్హత పత్రం, ఇతర ఒరిజినల్, జెరాక్స్ కాపీలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9550395298 సంప్రదించాలని సూచించారు.

ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై రైతుల ఆందోళన

కె.కోటపాడు : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధరను తగ్గించే చర్యలను తీసుకోవడంపై చౌడువాడ విశాఖ డెయిరీ ఎదుట పాడి సభ్య రైతులు పాల కేన్‌లతో గురువారం నిరసన తెలిపారు. ఆవుపాలకు వెన్నశాతం బట్టి లీటర్‌కు గరిష్టంగా చెల్లించే ధర రూ.44.5 పైసల నుంచి రూ.40.86 పైసలకు తగ్గించడం వల్ల పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతారని వారు తెలిపారు. పశుపోషణకు తవుడు, నూకలు, ఫీడ్ ధరలు పెరిగిపోతున్న సమయంలో పాల ధరను డెయిరీ యాజమాన్యం తగ్గించడం అన్యాయమని అన్నారు. గత రెండేళ్ల నుంచి విశాఖ డెయిరీ నుంచి రైతులకు బోనస్ నగదును అందించలేకున్నా, ప్రస్తుతం ధరను తగ్గించే చర్యలు వెనక్కి తీసుకొని ఆవుపాలకు గతంలో ఉన్న మద్దతు ధరను అందించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ రైతులతో మాట్లాడారు. డెయిరీ యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తీసుకువచ్చిన పాలను విశాఖ డెయిరీకి వేశారు.



చౌడువాడలో డెయిరీ ఎదుట పాల కేన్‌లతో నిరసన తెలుపుతున్న రైతులు

పీజీ కోర్సులకు అవకాశం కల్పించాలి

- స్పీకర్ అయ్యన్నకు ఎస్ఎఫ్ఐ నాయకుల విజ్ఞప్తి

నర్సీపట్నం : ఆంధ్రా యూనివర్శిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నను జిల్లా ఎస్ఎఫ్ఐ విభాగం అధ్యక్షురాలు గీతాకృష్ణ కోరారు. స్పాట్ అడ్మిషన్లు చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలో మెరిట్ లేకపోయినా అడ్మిషన్లు జాయిన్ చేయడం జరుగుతుందని, ఆంధ్రా యూనివర్శిటీలో స్పాట్ అడ్మిషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీని వల్ల ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే చర్యలు తీసుకోని విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ ఏయూ వీసీతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాముడు, మోహన్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్



విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై వివరిస్తున్న సెట్విస్ రీసోర్స్ పర్సన్ బాబు

కె.కోటపాడు : విద్యార్థులు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సెట్విస్ రీసోర్స్ పర్సన్ ఎస్.ఎ. బాబు అన్నారు. కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో 8 నుంచి10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు గురువారం కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. ఉద్యోగానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూ సమయంలో ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా ఉద్యోగార్థులు ఎటువంటి ఒత్తిడి అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. యువత మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలన్న లక్ష్యంతో చదువులు అందిపుచ్చుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు.

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందిస్తాం

తహసీల్దారు కుమారస్వామి



కొయ్యూరు: రెవెన్యూ సమస్యలపై వచ్చిన వినతులను సత్వరమే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వి.కుమారస్వామి తెలిపారు. సాధ్యమైనంత వరకు పరిష్కారంలో జాప్యాన్ని నివారిస్తామన్నారు. ఆయన గురువారం మాట్లాడారు. 23 పంచాయతీల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించేందుకు వీలుగా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. మ్యుటేషన్లు, ఇతర వివాదాలపై దృష్టి సారిస్తామన్నారు. మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. తాజాగా బూదరాళ్ల పంచాయతీ పోకలపాలెంలో గ్రామసభను నిర్వహించినట్టుగా చెప్పారు. సమస్యలపై ప్రజలు నేరుగా కలవవచ్చన్నారు. సర్టిఫికెట్లను సకాలంలో అందజేస్తామన్నారు. అందరి సహకారంతో మండలాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు.

ఎండు తెగులు నివారణకు సూచనలు

కొయ్యూరు: వరికి ఎండు తెగులు సోకినప్పుడు రంగు మారుతుందని ఏవో ఉమాదేవి తెలిపారు. ఎండు తెగులు సోకినప్పుడు యూరియా వాడొద్దన్నారు. ఆమె గురువారం కించవానిపాలెం, కొయ్యూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండు తెగులు నివారణకు వీలుగా ఇమిడా క్లోప్రిడ్ 25 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వచ్చే నెల 15 కల్లా ఏర్పాటు చేయాలన్నారు. పశువైద్యుడు రాజేష్‌కుమార్ మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. సర్పంచ్ ఇంగుల త్రినాథమూర్తి పడాల్, మాజీ ఎంపీటీసీ బి. శివరామరాజు, హెచ్ఏలు ప్రభాకర్, రూప పాల్గొన్నారు.



పొలంలో సూచనలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పంచాయతీ చట్టాల పట్ల అవగాహన తప్పనిసరి

చింతపల్లి: పంచాయతీ చట్టాలపై ప్రతి వార్డు సభ్యుడు అవగాహన కలిగి ఉండాలని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. పంచాయతీలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా గ్రామసభ తీర్మానం ఉండాలన్నారు. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు పంచాయతీ చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల గిరిజన గ్రామాలకు విడుదలైన నిధులు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

కొయ్యూరు: వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఎంపీడీవో మేరీరోజ్ మాట్లాడుతూ సభ్యులు విధుల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంచాయతీల్లో చేయాల్సిన అనేక అంశాలను ఆమె వివరించారు. దీనికి 33 పంచాయతీల నుంచి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

డుంబ్రిగుడ: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ అరకు ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర తెలిపారు. పల్లె పండగలో భాగంగా కంద్రుమ్ పంచాయతీ సర్రాయి నుంచి ఓంభి వరకు మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు ఉప సర్పంచ్ కిముడు ఫాతిమా, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావులతో కలిసి ఆయన కొబ్బరియ కొట్టి ప్రారంభించారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు: సర్పంచ్ హరి

పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని కంద్రుమ్ సర్పంచ్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కిముడు హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓంభిలో డబ్ల్యూబీఎం రోడ్డు పనుల ప్రారంభోత్సవానికి స్థానిక సర్పంచ్‌ను ఆహ్వానించలేదని విమర్శించారు. ఈ రోడ్డు గత వైఎస్సార్ సీపీ హయాంలోనే మంజూరైందన్నారు. అధికారిక కార్యక్రమంలో కూటమి నాయకులనే కాకుండా స్థానిక పంచాయతీ ప్రజా ప్రతినిధులను గౌరవించాలని కోరారు.

కొయ్యూరు: పల్లె పండగలో భాగంగా గురువారం కొయ్యూరు పంచాయతీలో కొత్త పనులకు సర్పంచ్ మాకాడ బాలరాజు భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యదర్శి నాయుడు, స్థానిక పెద్దలు మేడిబోయిన చిన్న, దొరబాబు, అనిశెట్టి చిరంజీవి, మహిళలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పల్లె పండగలో భాగంగా సింగర్భ, కోరాలపల్లి పంచాయతీల్లో బీటీ రోడ్డు, ఇతర పనులను సర్పంచ్‌లు మసాడి కొండమ్మ, రాజులమ్మ ఎంపీటీసీ పాంగి లక్ష్మి, నానాజీ గురువారం ప్రారంభించారు. గొడ్డుబూసులులో రూ.56 లక్షలతో బీటీ రోడ్డు, పారం ఫండ్ వంటి పనులు చేపడుతున్నారు. అరగడపల్లి గ్రామంలో గోకులం షెడ్ పనులు చేస్తున్నారు. ఏపీవో కొండబాబు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, టీఏ గోవర్ధన్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గంగరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు, వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

హుకుంపేట: క్షయ(టీబీ) నిర్మూలనపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో క్షయపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గుతో పాటు కఫం, రాత్రి పూట జ్వరం రావటం, ఆకలి లేకపోవటం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంతేకాకుండా గ్రామాల్లో టీబీ లక్షణాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. హెచ్ఎం కొండమ్మ, టీబీ కో ఆర్డినేటర్ సదానందం, ఫీల్డ్ కో ఆర్డినేటర్ ధనరాజ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మోహన్‌రెడ్డి

పేదలకు ఉచిత వైద్యసేవల ఘనత వైఎస్ కుటుంబానిదే

బుచ్చెయ్యపేట : పేదలకు కార్పొరేటు వైద్య సేవలు అందించిన ఘనత వై.ఎస్ కుటుంబానికే దక్కుతుందని వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం తెలిపారు. గురువారం దిబ్బిడి గ్రామంలో విశాఖకు చెందిన ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలను పరిశీలించిన వీరు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదోడికి, ధనికుడికి ఒకే దగ్గర వైద్య సేవలు అందాలన్న దృఢ సంకల్పంతో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు తీసుకురాగా ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిబాటలోనే నిలిచి పేదోడికి రూ, 25 లక్షల వరకు వైద్య సేవలు అందేలా ఆరోగ్య వైద్య సేవలను విస్తరించారన్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించి దృష్టి లోపాలను సరిచేస్తున్న ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ ఆర్. సోములు, వైద్య సిబ్బంది సాయికుమార్, అనూష, మహేంద్ర రోగులకు ఉచిత వైద్య సేవలు మందులు అందించారు. దిబ్బిడి, నేతవానిపాలెం గ్రామాల నుంచి 80 మంది వైద్య శిబిరంలో పాల్గొనగా వీరిలో దృష్టి లోపం ఎక్కువగా ఉన్న 25 మందిని కంటి చికిత్సలకు, 20 మందికి కళ్లద్దాలకు ఎంపిక చేశారు. పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దిబ్బిడిలో కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్